
# అవధాని ఆశయం

— సత్యవాడ సోదరీ మణులు



ఊహ తెలిసినప్పటినుంచీ అవధానిని ఊరిస్తున్న కోరిక తీరే తరుణం రానే వచ్చింది.

అరవై ఆరేళ్లు పైబడ్డ అతను విమానంలో కాలుపెట్టాడు. ఆ కుషన్ కుర్చీలో సర్దుకుని కూర్చునేసరికి ఎంత చైతన్యం! నడుముకు బెల్టు బిగించుకుని ఆ మెత్తని శాలువా తీసి కప్పుకున్నాడు. ఓ తియ్యని గొంతు పలకరించి హెడ్ ఫోన్ అందించింది. వెంటనే దాన్ని అమర్చేసుకుని, అర్థం కాని ఆ సంగీతాన్నే వింటూ ఆనందానుభూతిలో తేలిపోతున్నాడు.

హడావుడిగా తిరుగుతూ అందరికీ అన్నీ చిటికెలో సమకూరుస్తున్న ఆ యువతులంతా అవధాని కంటికి అప్సరసలైపోయారు.

"ఓం అప్సర కామినీ సేవితాయ నమః!" అప్రయత్నంగా అవధాని నోట పలికేసింది నామం.

వేంకటేశ్వర అష్టోత్తరంలో ఈ నామం ఎక్కడ ఉంది? శ్రద్ధగా వింటున్న కొందరు భక్తులు విస్తుపోయారు. అవధాని ఉలిక్కిపడ్డాడు. తానున్నది ఎక్కడ? ఊహాలోకం నుంచి వాస్తవానికి వచ్చాడు. తను నలభై ఏళ్లుగా నిష్ఠతో అర్చన చేస్తున్న ఇష్టదైవం వేంకటేశ్వరుని సన్నిధిలో ఇంతమంది భక్తులచేత పూజ చేయిస్తూ, ఛీఛీ! తన నాలుక ఇలా ఉచ్ఛరించిందేమిటి?

అవును మరి, మనసు గగనవిహారం చేస్తోంది. తను స్థిమితాన్ని కోల్పోతున్నాడు. రేపో మాపో అనంతం దగ్గర నుంచి ఉత్తరం రానే వస్తుంది. తన ఊహలు నిజమై హాయిగా అమెరికా పారుడవుతాడు. ఆలోచిస్తూనే అర్చన పూర్తి చేయించి ఇంటికి బయలుదేరాడు.

ఓ రెండువారాలు ఎదురు చూశాక అనంతం దగ్గరనుంచి ఉత్తరం అందుకున్నాడు. ఆత్రంగా చదివిన అతని చుట్టూ సెగలూ, పొగలూ కమ్ముకున్నాయి. హోమగుండంలో పడిన మంచి నెయ్యిలా అవధాని అమాయక హృదయం దహించుకుపోయింది.

తన కొడుకు అనంతం ... తన అంతులేని ఆశల రూపం అనంతం .... తను రక్తం పంచి జన్మనిచ్చి వాడికోసమే తన సర్వస్వం ధారపోస్తే, వాడికిప్పుడు తను ఎందుకూ కొరగాని వాడయ్యాడు. పురిటికందుని తనకప్పగించి భార్య అలమేలు కన్నుమూస్తే తను కళ్లల్లో పెట్టుకుని పెంచాడు. మారుటి తల్లి వస్తే తన చిట్టితండ్రిని బాధలు పెడుతుందేమో అనేగా తన వయస్సుని హారతి కర్పూరంలా కరిగించాడు. తమని లక్ష్యపెట్టలేదని తల్లిదండ్రులు వాపోయేవారు.

"ముప్పై ఏళ్లకే ముసలితనం పైబడ్డట్టు ఏమిటిరా, ఈ విరక్తి? లక్షణంగా పెళ్లి చేసుకుని సుఖపడు! అనంతం నీకు కొడుకైతే మాకు మనవడు కదా! వాడి ఆలనా, పాలనా మేం చూసుకోమా?" అనే అమ్మ.

"వాడి కేం చెప్పినా, చెవిటివాడి చెవిలో శంఖం ఊదినట్టే! కాకపోతే ఆ పసిగుడ్డే లోకం అయినట్టు ఊరికే ఇదైపోతున్నాడు. చూస్తున్నావుగా ... ఈమధ్య ఆలయానికి కూడా కొడుకుని చంకనేసుకునే వెళ్తున్నాడు. మరో ఆడపిల్ల ఇల్లాలుగా అడుగుపెట్టి నట్టింట్లో దీపం పెడితే మన అందరి బతుకుల్లో చీకటి మాయం అయిపోదూ? ఎంత చెప్పినా వాడికర్థం కాదు. అందుకే నాకు ఒళ్లు మంట!" నాన్న గంటల తరబడి దండకం వల్లించేవాడు.

తను పెదవి కదిపేవాడు కాదు. కన్నవాళ్ల మాటకి విలువనిచ్చి తన జీవితంలోకి మరో ఆడదాన్ని ఆహ్వానించి ఉంటే ఏమై ఉండేదో ...? అనంతమే సర్వస్వంగా భావించాడు. కనుకనే వాణ్ణి ఈ స్థితికి తీసుకురాగలిగాడు. నాన్న అన్నట్టు కొడుకే తన ప్రపంచం అనుకుని బతికాడు.


ఇప్పుడు తన అపురూప ప్రపంచంలోకి తండ్రి అడుగుపెట్టడం మహాపరాధంగా భావిస్తున్నాడు వాడు. అందుకు నిదర్శనమేగా ఈ ఉత్తరం! పదే పదే చదువుకోసాగాడు. దానిలోని కొన్ని మాటలు అవధానిని పాతాళంలోకి తోసేస్తున్నాయి. తను వెర్రిబాగులవాడా? తనదో పనికిమాలిన వృత్తా? అక్కడ తననంతా వింత జంతువులా చూస్తారని రాస్తున్నాడే! వాడు ఎవరివల్ల ఇంతటివాడయ్యాడు? ఆ అభిమానం ఆవంత కూడా లేకుండా ఏం రాశాడు ...?

ఒక్కో మాటా అతని గుండెలు పిండేస్తున్నాయి.

"ఊరు దద్దరిల్లిపోయేలా కంచుకంఠంతో వేదమంత్రాల పేరిట గొంతు చించుకునే మీరు, వికృతంగా కనిపించే మీ పంచెకట్టు, విభూతి నామాలు, రుద్రాక్షమాలలు... ఇక్కడివారికి ఎగతాళిగా కనిపిస్తారు. వాటన్నిటికీ తిలోదకాలిచ్చి నా దగ్గరే ఉండిపోతా ననవచ్చు. అది కలలో మాట! ఇక్కడ ఎవరూ కూర్చుని తినరు. కలసి బతకరు. ఎవరికి వారే అన్నట్టుండేచోట ఈ జంజాటం నేను పెట్టుకోను!"

ఉత్తరాన్ని గిరాటేశాడు. వీడి నిక తల్చుకోకూడదు. అలమేలుతోపాటే వీణ్ణి మట్టిలో కలిపేశానని అనుకుంటే పోలా? అతని పెదాలపై శుష్కహాసం చోటుచేసుకుంది. అదెలా సాధ్యం? తను కష్టపడి ఆర్జించిన ప్రతి పైసా, తన శరీరంలోని ప్రతి నెత్తురు బొట్టూ వాడికోసమే వెచ్చించాడు. చివరికి కన్నవాళ్లకి కూడా దూరమైంది తన పుత్రరత్నం మూలానే! ఎంత చెప్పినా, అమ్మా నాన్నల మాట పెడచెవిన పెట్టాడు. "పెళ్లీ పెటాకులూ మానేసి ఇంతోటి ఈ నలుసుకోసం నీ బతుకు చేజేతులా నాశనం చేసుకుంటున్నావు! నువ్వు ఇలాగే అఘోరించు. మా శేష జీవితాన్ని అమ్మాయి దగ్గరే గడిపేస్తాం!" అనేసి వాళ్లక్క దగ్గరకే వెళ్లిపోయారు.

వాళ్ల ఆవేదన తనని అణుమాత్రమైనా కదలించలేకపోయింది. కొడుకును కాన్వెంటులో చేర్పాడు. వాడు ముద్దుముద్దుగా రైమ్స్ చదువుతూ ముచ్చటగా అభినయం చేస్తుంటే ఎంత మురిసిపోయాడని! తనలా వేదమంత్రాలు వల్లిస్తూ కూర్చోడు వీడు. గొప్ప చదువులు చదువుకుని ఎంతో ఎత్తుకు ఎదిగిపోతాడు. గుడిలో అర్చనలు చేయిస్తూ 'పంతులూ! బాపనయ్యా' అని పిలిపించుకోడు. కంప్యూటరు ముందు కూర్చుని తన చుట్టూ, 'సార్.... సార్!' అంటూ వేలాదిమంది చేత పిలిపించుకునే ఉద్యోగం చేస్తాడు. వాణ్ణి ఎలా అయినా అమెరికా పంపించి తీరుతాడు. తను జీవితంలో నెరవేర్చుకోలేని ఆశయం అనంతంలో ప్రతిఫలిస్తుంది. అప్పుడు తన కోరికా తీరిపోదూ! కాసిని నీళ్లు పోసి పెంచినంత మాత్రాన మొక్క పూలనిస్తుంది. నాటి నాలుగు కాలాలు సంరక్షణ చేస్తే చెట్టు కమ్మని ఫలాలనిచ్చి ఆకలి తీరుస్తుంది. పాడియావు, పంటపొలం అన్నీ అలానే తనకోసం శ్రమించినవానికి మునుగడ ప్రసాదిస్తాయి. అలాంటిది ఇంత అభిమానంతో తనకోసం ఏమీ ఆలోచించుకోకుండా, తనకంటూ ఏదీ మిగుల్చుకోకుండా కొడుక్కి బంగారుబాట ఏర్పరిస్తే, వాడు తనని కళ్లల్లో పెట్టి చూసుకోడూ! అలా అనుకునే తన ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా అనంతాన్ని చదివించటానికి ప్రయాసపడ్డాడు. తన




దగ్గరే ఉంటే వృత్తి వాసన ఎక్కడ అంటుకుంటుందోనని పై ఊళ్లల్లో ఉంచి మరీ చదివించాడు.

తను కోరుకున్నట్లు కొడుకు విద్యావంతుడవుతుంటే అవధాని ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తనెప్పుడో పసితనంలో అనుకునేవాడు పెద్ద చదువులు చదువుకోవాలని. అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడిపోవాలని తండ్రి చాదస్తం, కులవృత్తిపట్ల అతనికున్న మమకారం తనని కనీసం కాలేజీలో కాలు పెట్టనివ్వలేదు. అందుకే కొడుకు ఒక్కో మెట్టూ ఎక్కి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నాడని ఆ తండ్రికింత సంబరం!

కంప్యూటర్ ఇంజనీర్‌గా పెద్ద కంపెనీలో ఉద్యోగం సంపాదించుకుని, ఆ కంపెనీవారి ఖర్చుతోనే అనంత్ అమెరికా వెళ్తున్నప్పుడు అవధానికనిపించింది కొండంత దేవుడు తనకు కొండంత వరాన్నే అనుగ్రహించాడని. అతని మనస్సు ఆకాశానికెగసింది. ఇంకేముంది! తన ఆశయం నెరవేరిపోయినట్టే! తనపాటికి తనని వదిలేసి అనంత్ ఇలా హాయిగా జీవించగలడనీ ఊహించలేకపోయాడు.

ఎన్ని ఆశలు అల్లుకున్నాడు ... ఎన్ని గాలిమేడలు కట్టుకున్నాడు..? ఇప్పుడవన్నీ నేలమట్టమైపోయాయి. ఒక్కసారిగా ఒంటరితనం, నిర్లిప్తత అవధానిని ఆవరించాయి. నిస్సారంగా, భారంగా రోజులు నెట్టుకొస్తున్నాడు. రూపుమాసిపోయిన అతని ఆశయం విచిత్రంగా తిరిగి ఊపిరి పోసుకుంది.

శివానందంవైపు నమ్మలేనట్లు చూస్తున్నాడు "నా పిచ్చితనం తెలుసు కనుక ఆటపట్టిస్తున్నావు కదరా! కాకపోతే, మీ అబ్బాయి కపర్థి అమెరికా అమ్మాయిని ప్రేమించి అక్కడే .... మన



సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకోవాలనుకోవటం, లక్షలు ఖర్చయినా లెక్కచేయకుండా నన్ను తీసుకురమ్మనటం ... ఇదంతా ఎగతాళి కాదా?" అన్నాడు తొట్రుపాటుతో అవధాని. స్నేహితుణ్ణి ఆలింగనం చేసుకుని అతని కళ్లల్లోకి ఆత్మీయంగా చూస్తూ

"ఏరా, అవధానీ! చిన్నప్పుడు బిళ్లంగోడు ఆడుకున్నప్పటి నుంచి ఏనాడైనా నిన్ను ఎగతాళి చేశానా? తొటి పిల్లలు నామాల బాపడు అని అంటూ నిన్ను వెక్కిరిస్తుంటే ... వాళ్లందరి మీదా బలప్రయోగం చేసి నీ మీద ఈగ కూడా వాలనిచ్చేవాణ్ణి కాదని మర్చిపోయావట్రా...! ఓరి వెర్రివాడా! నువ్వు నాతో అమెరికా వస్తున్నావు. నువ్వు గమనించలేదేమో, మా కుటుంబంలో అందరికీ నీ పట్ల ఎంతో ప్రత్యేకమైన భక్తి గౌరవాలు, అంతకుమించిన అభిమానమూ ఉన్నాయిరా! అందుకనే మా వాడికి నిన్ను రప్పించుకోవాలని ఇంత పట్టుదల!"

000

అవధాని తన శ్రావ్యమైన కంఠంతో వివాహ మంత్రాలు చదువుతున్నాడు. యథావిధిగా కపర్థి పెళ్లితంతు జరిగిపోతోంది.

తండ్రిని చూసిన అనంత్ నిశ్చేష్టుడైపోయాడు. 'నాన్నా ...' అన్న రెండక్షరాలు గొంతులోనే కొట్టాడుతున్నాయి. నోట మాట రావడంలేదు. అప్పుడు మేల్కొన్నాయి అతనిలోని పితృభక్తి, వివేకం. తన మనసులో మమతలను మసిచేసిన నాగరికత వ్యామోహం పటాపంచలైపోయింది. తనని తాను మరిచి తండ్రి కాళ్లమీద పడిపోయాడు. "నాన్నా! నన్ను క్షమించగలవా?" అతి ప్రయత్నం మీద అనగలిగాడు.

అవధాని మౌనంగా కొడుకుని లేవదీశాడు.

ముసిముసి నవ్వులతో ముందుకొచ్చాడు కపర్థి "ఏం మిత్రమా! మీ నాన్ననిక్కడ చూస్తావనుకోలేదు కదూ?"

"నీ మాటలతో నన్ను చిత్రవధ చెయ్యద్దురా కపర్థీ! నువ్వు కావాలనే ఇంత చేశావు. మా నాన్ననే రప్పించి నా చేతులతో, నేనే చెంపలు వాయించుకునేట్లు చేశావు."

"అలా ఎందుకనుకోవాలి? ఎవరి స్థాయిలో వాళ్లు తమవారిచేత గౌరవాభిమానాలు పొందటానికి ఎప్పుడూ అర్హులేరా! నీ తండ్రిని నువ్వు ఆత్మీయంగా చూసుకుంటే నాగరిక సమాజంలో తేలికైపోతావేమోనని సంకోచించావు. కన్న కొడుక్కి దూరమై, జీవితాంతం కుమిలిపోయే పరిస్థితి కల్పించావు. మన దైవభక్తి, సంప్రదాయాల్ని మనమే చులకన చేయాల్సిన పని లేదురా! ఎప్పటికీ వాటి విలువ వాటిదే! మీ నాన్న పురోహితుడని చిన్నతనమెందుకు? ఆ వృత్తే కదా నిన్ను ఇంతటివాణ్ణి చేసింది!"

"నా పొరపాటు తెలుసుకున్నానురా, అందుకేగా నాన్నని క్షమాభిక్ష వేడుకుంటున్నాను. ఇంక నాన్న నా దగ్గరే ఉంటారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు నేను చేసుకుంటాను."

"వద్దు, బాబూ! నువ్వనుకుంటున్నట్లు నేను నీ దగ్గర ఉండను. శివతోనే వెనక్కి వెళ్లిపోతాను. చివరి క్షణం వరకూ దైవార్చనలోనే గడుపుతాను."

తండ్రి మాటల్లో దృఢనిశ్చయం అనంత్‌ని మరేం మాట్లాడనివ్వలేదు.

"పోనీలే, మీ నాన్న ఇష్టమే కానీ, అతన్ని పువ్వుల్లో పెట్టి ఇండియా పంపిస్తాను. ఒకసారి ఈ దేశం చూసి అతని ఆశయం నెరవేర్చుకున్నారుగా!"

కపర్థి మాటలకు అవధాని నిండుగా నవ్వాడు.

■

